**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.6, Issue-5, May, 2019**
**Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in**

# మన పండుగలు

**డా. వై విజయానంద రాజు**
తెలుగు శాఖాధిపతి
పి.బి. సిద్దార్థ కళాశాల, విజయవాడ

మామూలు రోజు కన్నా విశేషంగా, విశిష్టంగా, వేడుకగా, ఉత్సాహంగా జరుపుకునే రోజులను "పండుగలు" అని అంటారు.

ఏదైనా ఒక అందమైన దృశ్యాన్నికానీ, చక్కని సన్నివేశాన్ని కానీ చూసినప్పుడు, "కన్నుల పండుగ"గా ఉందంటాం.అందుకే ఆహ్లాదాన్నీ, వినోదాన్నీ అందించే సందర్భమే పండుగగా చెప్పవచ్చు. పండుగంటే సంబరం, ఆనందం, ఉత్సవం అని నైఘంటికార్థాలున్నాయి. "పండువు" అనే పదం "పండువ", "పండుగు" "పండుగ" గా రూపాంతరం చెందింది.

పండుగల ప్రధాన ఉద్దేశం సామూహికానందం. సాముహికత్వం లేనిదే పండుగల వల్ల వచ్చే ఆనందానికి అర్థం, పరమార్థం ఉండదు.

పండుగల్లో ఉన్నంతలో అందరూ రకరకాల పిండి వంటల్ని తయారుచేసుకుంటారు. కొత్త బట్టల్ని కట్టుకుంటారు. ఇంటి ముంగిళ్ళను ముగ్గులతో, పసుపు కుంకాలతో అలంకరిస్తారు. బంధు మిత్రులతో కలసి హాయిగా, ఆనందంగా గడుపుతారు. పూజలు, వ్రతాలు నిర్వహిస్తారు. గుళ్ళు, గోపురాలను దర్శిస్తారు.

ఒకప్పుడు ప్రజల జీవన విధానమంతా కాయ కష్టంతో ముడి పడి ఉండేది. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి ఉండేది. అలా జీవనం గడిపే సామన్య ప్రజలకు క్షణం తీరికగానీ, కాలక్షేపంగానీ ఉండేది కాదు. నిరంతరం కష్టపడి పనిచేసి, అలసిపోయి, విశ్రాంతి కోసం ఎదురుచూసేవారు. వాళ్ళ మనసులు ఉల్లాసం కోసం, వినోదం కోసం వెంపర్లాడేవి. అందుకు ఏర్పాటు చేసుకున్నవే పండుగలు.

ఈ పండుగలను స్థూలంగా మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

1) ఋతు ప్రధానాలు (ఉదా: ఉగాది, సంక్రాంతి)
2) దేవతా ప్రధానాలు (ఉదా: వినాయక చవితి, శివరాత్రి)
3) చారిత్రక పురుష జన్మ ప్రధానాలు (ఉదా: శ్రీరామ నవమి, కృష్ణాష్టమి)

పండుగలు ఋతు సంబంధాలైన, దేవతా సంబంధాలైన, చారిత్రక సంబంధాలైన అవి ప్రజల మనస్సుల్లో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపి, జీవితాలను సుఖమయం చేస్తాయి. అందువల్ల ఒకప్పుడు పండుగలకు విశేషమైన ప్రాధాన్యత ఉండేది.

## సంక్రాంతి:

సంక్రాంతి అంటే సంక్రమించడం (ప్రవేశించడం) అని అర్థం. ఇది ప్రతి సంవత్సరం జనవరి 14వ తేదినే వస్తుంది. సూర్యుని సంచారాన్ని అనుసరించి వచ్చే పండుగ కనుక ఎప్పుడు ఒకే తేదీన వస్తుంది. దీన్ని తెలుగు 'మాసాలలోకి, తిథులలోకి మారిస్తే ఒకసారి పుష్యమాసంలో మరొకసారి మాఘమాసంలో వస్తుంది. మనకు రాశులు 12. మాసాలు 12. సుర్యుడూ ఒక్కొక్క మాసం ఒక్కొక్క రాశిలో ప్రవేశిస్తాడు. ఈ విధంగా చూస్తే ప్రతి నెల సంక్రాంతి వస్తూనే ఉంటుంది. అయితే సూర్యుడు మకరరాశిలో ప్రవేశించినవుడు ఆ సంక్రాంతిని మకర సంక్రాంతి అంటారు.

ఈ పండుగను మూడు రోజులు జరుపుకుంటారు. తొలి రోజు భోగి. ఆ రోజు ఉదయాన్నే లేచి తల స్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు. చలి రోజులు కాబట్టి ఉదయాన్నే భోగి మంటలు వేస్తారు. కొన్ని ప్రాంతాలలో ఈ రోజు నువ్వులు కలిపిన జొన్న రొట్టెలు గాని, భక్ష్యాలు కాని చేస్తారు. మరుసటి రోజు సంక్రాంతి. ఆ రోజు ఉదయాన్నే పేడతో కళ్ళాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేస్తారు. ముగ్గులలో గొబ్బిళ్ళను పెడతారు. కొన్ని ప్రాంతాలలో ఇంటి ముందు పాలు పొంగించటం ఆచారం. పాలు పొంగాక అందులో కొత్త బియ్యం, బెల్లం వేసి పొంగలి చేస్తారు. ఇది సంక్రాంతి పండుగ ప్రత్యేకం.

మూడవ రోజు కనుమ పండుగ. ఈ రోజు రైతులు వారి వారి పశువులను, బండ్లను అందంగా అలంకరించి, గ్రామాలలో ప్రభలు కట్టి వాటిపై దేవతామూర్తులను అలంకరించి ఊరేగిస్తారు. ఈ రోజు బంధు మిత్రులతో కలసి విందు వినోదాలతో గడుపుతారు.

ధనుర్మాసం ప్రారంభం నుండి హరిదాసులు బంతిపూలు చుట్టుకొని నిలువు నామాలు పెట్టుకొని తళతళలాడే రాగి పాత్రను నెత్తిన పెట్టుకుని, చేతిలో చిరుతలతో, కాళ్ళకు గజ్జలతో "హరిలో రంగ హరీ" అంటూ ఇంటింటికి హరి కీర్తనలు పాడుతూ, గృహస్తులిచ్చే వస్తువులను స్వీకరిస్తూ తిరుగుతూ ఉంటారు. కన్నె పిల్లలు ఆవు పేడతో గొబ్బెమ్మలను గుండ్రంగా చేస్తారు. కంచెల మీద పెరళ్ళలోనూ ప్రాకిన గుమ్మడి తీగల నుంచి గుమ్మడి పూలను కోసి గొబ్బెమ్మల మీద అందంగా అలంకిరిస్తారు. గంగిరెద్దుల ఆటలు, డూడూ బసవన్నల విన్యాసాలు, కోలాటాలు ఇవన్నీ సంక్రాంతి విశేషాలే.

## విజయదశమి (దసరా)

ఈ పండుగ ఆంగ్ల మాసాల ప్రకారం అక్టోబర్‌లో వస్తుంది. తెలుగు మాసాలలోనైతే ఆశ్వయుజ మాసంలో శక్ల పక్షంలో దశమీ తిథియందు జరుపబడును. ఇది శుద్ధ పాడ్యమి నాటి నుండి దశమి వరకు పదిరోజుల పాటు జరుగును. పదవ రోజును అనగా దశమిని "విజయదశమి" అని అంటారు.

ఈ విజయదశమి ఎలా ప్రారంభమయ్యింది అనే విషయంలో భిన్న అభిప్రాయాలున్నాయి. విజయుని (అర్జునుడు) విజయం నుండీ ప్రారంభమైనదిని కొందరు, శ్రీరాముని విజయం నుండి ప్రారంభమైనదని మరికొందరు భావిస్తున్నారు.

ప్రజలందరు ఈ దశమి నాడు ఆయుధ పూజను విశేషంగా చేస్తారు. ఎందుకంటే శ్రీరామునికీ, అర్జునునికీ ఆనాడు విశేషంగా ఆయుధాలు ఉపయోగపడి విజయాన్ని అందించాయి. కావున ఆయుధ పూజ ఉత్సాహంతో చేస్తారు. ఆయుధాలనే కాక రైతు నాగలిని, కుమ్మరి కొలిమిని, వడ్రంగి ఉలి, బాడిసను, సాలెవారు మగ్గాన్ని విద్యార్థులు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.6, Issue-5, May, 2019
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

తమ పుస్తకాలను ఈ విధంగా ఆయా వృత్తుల వారు వారి పరికరాలను భక్తితో పూజించి అభ్యుదయాన్నీ, విజయాన్నీ ప్రసాదించమని వేడుకుంటారు. వాహనాలను పసువు కుంకుమలతో. పూల మాలలతో మామిడి తోరణాలతో అలంకరించి వైభవంగా ఈ పండుగ జరువుకుంటారు.

## దీపావళి :

దీప + ఆవళి = దీపావళి, దీపాల వరుస అని దీని అర్థం. ఈ పండుగ ఆశ్వయుజ బహుళ చతుర్దశి రోజు వస్తుంది. ఆంగ్ల మాసాల ప్రకారం అక్టోబర్/నవంబర్ లో వస్తుంది. ఈ పండుగ రోజు ప్రమిదలలో నూనె పోసి, ఒత్తు వేసి ఇంటి ముంగిట, అరుగల పైన, మేడలపైన, ప్రహరీ గోడలపైన వరుసగా దీపాలు వెలిగిస్తారు. ఈ పండుగను నరక చతుర్దశి అని కూడా అంటారు.

లోక కంటకుడైన నరకుడుని సంహరించినది ఈ రోజునే కాబట్టి ప్రజలు ఈ పండుగను చేసుకుంటారని కొందరి అభిప్రాయం.

ఈ పండుగ రోజు పొద్దున్నే లేచి, తల స్నానాలు చేసి, కొత్త బట్టలు ధరిస్తారు. సాయంత్రం నుంచి టపాసులు కాలుస్తారు.

## ఉగాది :

యుగ + ఆది = యుగాది. ఇదే కాలక్రమంలో ఉగాది గా మార్పు చెందిందని కొందరి అభిప్రాయం. ఇక్కడ యుగం అన్నది కాలభేదానికీ, సంవత్సరానికి సంకేతం.

మొదటి బ్రహ్మదేవుడు ఈ ఉగాది రోజే జగత్ సృష్టి ప్రారంభించాడని కొందరి భావన.

తెలుగు వారి తొలి పండుగ ఉగాది. సంవత్సరంలో మొట్టమొదటిగా వచ్చే పంగ ఇది. అందుకే దీనిని "సంవత్సరాది" అని కూడా అంటారు. సంవత్సరంలో మొదటి మాసం చైత్రమాసం. ఈ మాసంలో శుక్లపక్ష పాడ్యమి రోజున ఈ పండుగ జరుపుకుంటారు. ఇది ఆంగ్ల మాసాల ప్రకారం మార్చిలో వస్తుంది.

అన్ని పండుగలలోలాగ తీపి పదార్థాలే కాకుండా చేదు పదార్థాలు కూడా తీసుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. అందుకే దీనిని "చేదు పండుగ" అని కూడా అంటారు.

వేప పూతతో పాటే, లేత మామిడి కాయ ముక్కలు, కొత్త చింతపండు పులుసు, కొత్త బెల్లం పాకం, గసగసాలు మొదలగు వానిని కలిపి "ఉగాది పచ్చడి" చేస్తారు. దీనినే "గుజ్జు" అని కూడా అంటారు. జీవితమంటే తీపి, చేదు కలయిక అనే ఉద్దేశంతో అన్ని రుచులు కలిపిన ఈ పచ్చడి తయారు చేస్తారు. పిండివంటలు, పాయసం, బొబ్బట్లతో బంధు మిత్రులంతా కలసి విందు భోజనం చేసి సాయంకాలం దేవాలయానికి వేళతారు. అక్కడ అందరూ సమావేశం అవుతారు. పంచాంగ శ్రవణం వింటారు. ఇందులో ఈ సంవత్సరం ఎవరు అధిపతి, పాడి పంటలు ఎలా ఉంటాయో, వర్షాలు ఎలా కురుస్తాయో, ఎవరెవరి గ్రహస్థితులు ఎలా ఉంటాయో పండితులు తెలుపుతారు.

## శ్రీ రామనవమి :

శ్రీ రాముని పుట్టిన రోజును శ్రీరామనవమిగా చేసుకుంటాము. చైత్ర శుద్ధ నవమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. ఆంగ్ల మాసాల ప్రకారం మార్చి / ఏప్రియల్ నెలలో ఇది వస్తుంది.

అతిధి పూజ ఈ పండగనాడు విశేషంగా చెప్పుకోదగినది. బ్రాహ్మణులను, విద్వాంసులను, బంధవులను, మిత్రులను ముత్తైదువులను ఇంటికి పిలిచి పీట వేసి వారికి వడపప్పు, పానకం, మజ్జిగ ఇచ్చి ఆరగింపచేస్తారు. పూజాసమయంలో పూజింపబడి, పసువు కుంకుమలతో అలంకరించబడిన కొత్త విసనకర్రలతో విసిరి, ఈ విసన కర్రలను దక్షిణ

తాంబులాలతో పాటు వారికి దానం చేస్తారు.

ఇది ఎండాకాలంలో వచ్చే పండుగ. పానకం శరీరానికి తాపం పోగొట్టి చలువను చేకూరిస్తుంది. అదే విధంగా పెసరపప్పు, మజ్జిగ కూడా చలువ పదార్థాలే. ఇలాంటి చలువ పదార్థాలను ఎండాకాలంలో అతిధికీయడం, పైగ విసనకర్రలతో విసరడం మనవతా దృష్టితో కూడుకొన్న సంప్రదాయం.

**కృష్ణాష్టమి :**

శ్రావణ మాసం బహుళ అష్టమి రోజున శ్రీకృష్ణుడు జన్మించాడు. ఈ రోజునే కృష్ణాష్టమిగా జరుపుకుంటాం. ఆంగ్ల మాసాల ప్రకారం ఆగష్టు / సెప్టెంబర్‌లో వస్తుంది.

కృష్ణాష్టమిరోజున భజనలతో, సంకీర్తనలతో భక్తులు రోజంతా గడుపుతారు. పగలంతా ఉపవాసం ఉండి సాయంకాలం గోవులింటికి తిరిగివచ్చే సమయంలో కృష్ణుడిని పూజించడం పరిపాటి.

ఈ రోజున చిన్ని కృష్ణుడు ఘల్లు ఘల్లుమని మువ్వలు సవ్వడించగా తమ తమ పూజామందిరాలకు ముద్దులొలికే పాదాలతో నడిచి వస్తాడనీ, ఇంటి ముంగిళ్ళ నుంచి మందిరాల దాకా కృష్ణ పాదాలను ముగ్గులతో చిత్రించడం చేస్తారు.

కృష్ణాష్టమి నాడు శ్రీకృష్ణునికి ఇష్టమైన వెన్న, పాలు, పెరుగు మొదలైన వాటితో పిండివంటలు చేస్తారు.

**నాగుల చవితి :**

ఈ పండగ కేవలం సర్పాలను పూజించడానికి ఏర్పాటుచేసుకున్న పండుగ. దీనిని ప్రతి సంవత్సరము శ్రావణ శుద్ధచతుర్థి రోజున జరుపుకుంటారు. ఆంగ్లమాసాల ప్రకారం అక్టోబర్ / నవంబర్‌లో వస్తుంది.

సర్పాలను పూజిస్తే ఎటువంటి సర్పదోషాలుగానీ, సర్పాల వలన బాధలు గానీ ఉండవని భావించి ప్రజలు ఈ పండుగను జరుపుకుంటారు.

ఈ పండుగ రోజు ఉదయాన్నే లేచి, తలస్నానం చేసి, నాగదేవతలకు పాలు, అన్నం, కొబ్బరి మొదలగు పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. కొందరు పాముల పుట్టల దగ్గరకు వెళ్ళి ప్రదక్షణ చేసి పసుపు, కుంకుమలతో, పూలతో నాగదేవతను పూజించి, యజ్ఞోపవీతాన్ని, వస్త్రాలను సమర్పించి పుట్టలో పాలు పోస్తారు. పూజ తరువాత పండుగకు సంబంధించిన కథను విని ఇంటికి తిరిగివస్తారు. ఆనాడు ఉపవాసం ఉంటారు.

**హోలి :**

ఈ పండుగను ఉత్తర భారతదేశంలో విశేషంగా జరుపుకుంటారు. ఇది ఫాల్గుణ శుక్ల పౌర్ణమి రోజున వస్తుంది. ఆంగ్ల మాసాల ప్రకారం మార్చిలో వస్తుంది.

హోలి అనునది ఒక రాక్షసి అనీ, అది శిశువులను సంహరించేదనీ, చివరకు దానిని సంహరించారని భవిష్యత్ పురాణంలో ఉంది.

హోలికా హిరణ్య కశిపుని చెల్లెలని, హిరణ్య కశిపుడు ప్రహ్లాదుని అగ్నిలో త్రోయించినపుడు హోలికా ప్రహ్లాదునితో అగ్నిలో ప్రవేశించి భస్మం అయ్యిందని తరువాత హోలికను శిశుసంరక్షణార్థం పూజించడం మొదలుపెట్టారని కొందరి అభిప్రాయం.

ఈ హోలి పండుగను డోలికోత్సవమని కూడా అంటారు. గోవిందుడు డోలికయందు అనగా ఊయల యందు ఎక్కిన కాలం ఈ ఫాల్గుణ పౌర్ణమి అనీ, ఈ రోజు నియమలతో పూజ చేసిన వారు వైకుంఠాన్ని పొందుతారని

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.6, Issue-5, May, 2019
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

కొందరి అభిప్రాయం. రంగులు చల్లుకొనుట, రంగు నీళ్లను వెదురు గొట్టాలతో చిమ్ముకోవటం ఈ పండుగ రోజున చేస్తారు.

**మహాశివరాత్రి :**

ఇది శైవులకు చాలా ముఖ్యమైన పండుగ. ఈ పండుగ ప్రతి సంవత్సరం మాఘమాస కృష్ణ చతుర్దశి రోజున వస్తుంది. ఆంగ్ల మాసాల ప్రకారం ఫిబ్రవరిలో వస్తుంది. ఈ రోజున భక్తులంతా ఉపవాసముండి, రాత్రంతా మేల్కొని ఉంటారు. భజనలతో, కీర్తనలతో, శివకథా శ్రవణంతో, రుద్రాభిషేకాలతో జాగరణ చేస్తారు. ఇలా చేస్తే పాపాలన్నీ తొలగిపోయి ముక్తి దొరుకుతుందని వారి నమ్మకం.

ఈ పండుగ రోజు ఎటువంటి పాపాత్ముడైన శ్రద్ధా భక్తులతో శివుని పూజిస్తే అకాల మరణం నుండి రక్షింపబడి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యం పొందుతారని నమ్ముతారు.

**వినాయక చవితి :**

ఈ పండుగ ఆగష్టు / సెప్టెంబర్‌లో వస్తుంది. తెలుగు మాసాల ప్రకారం భాద్రపద శుద్ధ చతుర్థి రోజున వస్తుంది. దీనినే "గణేష్ చతుర్థి" అని కూడా అంటారు. శుభాశుభ కార్యాలన్నింటిలోనూ మొదట విఘ్నేశ్వర పూజ చేయడం సంప్రదాయం అయినా విశేషించి ఈ భాద్రపద శుద్ధ చవితి రోజు విఘ్నేశ్వరాధన చేయడం మహాపుణ్యమని స్కాంద పురాణం చెబుతుంది.

ఈ పండుగ రోజున ఉదయాన్నే లేచి తలస్నానాలు చేసి బంగారం లేక వెండి లేక రాగి లేక మట్టి దేనితోనైనా సరే వినాయక ప్రతిమను చేసి ఇంటిలో ఉత్తర భాగంలో మండపం నిర్మించి దానియందు బియ్యంతో లేక లభ్యమైన ఏ ఇతర ధాన్యంతోనైనా అష్టదళ పద్మం నిర్మించి దానిపై గణేశుని ప్రతిమను నెలకొల్పుతారు. పసుపు కుంకుమలతో, పత్రపుష్పాలతో గరిక పూచలతో, ధూపదీపాలతో వినాయకుడ్ని పూజిస్తారు. కుడుములు మొదలైన 21 పిండివంటలతో నైవేద్యం సమర్పిస్తారు. ఈ పూజలో అరటిపండ్లు, వెలగపండ్లు కొత్తగా పండిన జొన్న, మొక్క జొన్న కంకులు, టెంకాయలు, చెరకులు మొదలైన ఫలాలన్నింటిని వినియోగిస్తారు.. నృత్య గీత వాయిద్యాలతో పురాణ పఠనాలతో గణేశుని పూజ పూర్తి చేస్తారు. బ్రహ్మణులకు తాంబుల దక్షిణాలిచ్చి బంధువులతో, మిత్రులతో కలిసి భుజిస్తారు.

మరుసటి రోజు సాయంత్రం వినాయక ప్రతిమను బావిలో లేక నదిలో వేస్తారు. ఈ పండుగను కొన్ని చోట్ల మూడు రోజులు జరుపుకుంటారు. మరికొన్నిచొట్ల "గణపతి నవరాత్రులు" అని తొమ్మిదివ రోజులు ఈ ఉత్సవాలు నిర్వాహిస్తారు. ప్రతిరోజు భజనలు, సంగీత నృత్యాలు, ఉపన్యాసాలు మొదలగు కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహించి చివరిరోజు ఊరేగింపుగా వెళ్ళి గణేశ నిమజ్జనం చేస్తారు.

ఇలా తరతరాలుగా మన పూర్వీకుల నుండి స్వీకరించిన నమ్మకాలు, ఆచారాలు, సాంప్రదాయలే పండుగలు. ఏ పండుగ ఎలా జరుపుకున్నా పండుగల ఉద్దేశ్యం ఒక్కటే. మానవులకు ధర్మార్థ కామ మోక్షాలను బోధించి, నీతి మార్గాన నడిచేటట్టు చేయడం. పండుగలను బంధుమిత్రులతో కలిసి జరుపుకోవడంలోనే ఆనందం ఉంటుంది. అందరిని ఒక చోట చేర్చి సాముహిక ఆనందాన్ని, ప్రయోజనాన్ని అందించేవి కేవలం పండుగలు మాత్రమే.

నేడు మానవులు ఆధునిక జీవితానికి అలవాటు పడి వేడుకలను చేసుకునే తీరిక, ఓపిక లేకుండా పోతుంది. పండుగలు హడవిడి జీవితాలకు కాస్త ఆహ్లాదాన్ని, ఊరటను కలిగించి, శరీరానికి కావలసిన పౌష్టికాహారాన్ని అందిస్తాయి. అందరితో గడిపే అవకాశాన్ని కలిగిస్తాయి.